


# మరోదారి లేదు

"నువ్వు నామినేషన్ వెయ్యగలవా?" ప్రధాన మంత్రి అడిగాడు.

"వెయ్యగలను" తిప్పేసామి చెప్పాడు.

"ఆపాలని మన పార్టీవాళ్ళే కుట్ర. ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇప్పుడే అందింది. జాగ్రత్త"

"సరే సరే!"

"హింస ఉండరాదు. ప్రాణ నష్టం జరగరాదు. నీ ప్రాణం భద్రం."

"సరే సరే!"

తిప్పేసామి ఫోను పెట్టేశాడు.

అనుచరులకు ఆత్రం. గదినిండా సపోర్టర్లు. ఫాలోయర్లు.


తిప్పేసామి వివరించాడు. అందరికీ కోపంగా ఉంది.

పేద వాళ్ళకోపం పెదాలకు శాపం. ఆఫీసు గది వేడెక్కింది.

"మనం రడీ!" అన్నాడు కమాండరు. తిక్క బట్టిన వాడు తిరిగినట్లు గదంతా కలయ దిరుగుతున్నాడు.ఎటువంటి హింసనయినా ఎదుర్కొనటానికి తాను సిద్ధంగా ఉన్నాడు.

కమాండరంటే నిజంగా కాదు. తనకుతానే పెట్టుకొన్న పేరు. తిప్పేసామికి బావమరిది. భార్యతమ్ముడు, బావమరిదే అంగరక్షకుడు. ఆపై కమాండరు.

తిప్పేసామి శ్రీకృష్ణుడనీ, తాను అర్జునుడనీ కమాండరు నమ్మకం. తాము నరనారాయణులమంటాడు తాను.



తాము పంచములైన పాండవులమనీ, వాళ్ళు నూర్గురైన కౌరవులనీ, ఎన్నికలే కురుక్షేత్రమనీ, విజయం తమకే ఖాయమనీ అతడి నమ్మకం.

జయం నిశ్చయమని తెలిసి కూడా కమాండరు ఆయుధాలు సిద్ధం చేశాడు. వాళ్ల ఏం సిద్ధం చేస్తున్నారో అవన్నీ తానూ సిద్ధం చేస్తున్నాడు.

నాటువి మోటువి మొదలుకొని అతి ఆధునికమయిన ఎ.కె. 47లు దాకా వాళ్ళ దగ్గరున్నాయి. ప్రభుత్వం అనుమతించేసేవే కావు. ప్రజలు అంగీకరించేవీ ఆయుధాలు ఉన్నాయి.

"ఎన్నికలు సజావుగా జరుగుతాయా?"

"అనుమానం లేదు."

"చెప్పలేం."

"జరక్కొం"

"సందేహమా?"

రకరకాల ప్రశ్నలు, జవాబులు.

శాసనసభకు ఎన్నికలు ప్రకటించిన దగ్గర్నుంచి వాతావరణం సరిగాలేదు. ఏదో అనిశ్చిత స్థితి. భయం.సందేహం.

నామినేషన్ వేయటానికి అదే ఆఖరి రోజు. సాయంకాలం మూడూ - ఐదూ మధ్య మంచి సమయం. ఐదింటికి ఆఫీసు క్లోజు. ఆపైన వీలులేదు.

అపోజిషన్ వాళ్ళూ, ఇండిపెండెంటులూ మూడు రోజులనాడే నామినేషన్లు దాఖలు చేశారు.

అధికార పార్టీ అభ్యర్థి తిప్పేసామి. దానికొక డమ్మీ కూడా ఉన్నాడు. అక్కడే సమస్య మొదలయింది.

అది రిజర్వుడు సీటు. తిప్పేసామి దళితుడు, డమ్మీకూడా డిటో, సామి చదువుకున్నవాడు. లాయరుగా పదేళ్ళు ప్రాక్టీసు చేశాడు. న్యాయమూర్తి అని పేరుంది.

జిల్లా జడ్జిగా వచ్చినా వెళ్ళలేదు. ఈ నియోజకవర్గం నుంచే మూడు సార్లు వరుసగా గెలిచాడు. పోయిన ఐదేళ్ళు మంత్రిగా ఉన్నాడు. ఉండటం ఆర్థిక మంత్రిగానే ఉన్నాడు.

లాయరుగా సంపాదించుకొన్నది మంత్రిగా ఖర్చుచేశాడు. ఏమీ సంపాదించుకోలేదు. నెమ్మదస్తుడు, భయస్తుడు, మంచివాడు, పనికిరానివాడు, అని సామికి పేరు ప్రఖ్యాతులున్నాయి.

ప్రధానమంత్రికి తిప్పేసామి చాలా ఇష్టం. వర్తమానంలో గత కాలం మనిషి అని అంటుండేవాడు. అతణ్ణి ముఖ్యమంత్రిని చేయాలని ప్రధానికి పట్టుదల. తానే పార్టీ అధ్యక్షుడు

ఇందులో సామి అర్హతతోపాటు పార్టీ రాజకీయం కూడా ఉంది.

కమ్యూనిష్టుల్ని చావుదెబ్బ తీయాలి. తమ పార్టీలోని ఫ్యూడల్ శక్తుల్ని అణగ్గొట్టాలి.

తిప్పేసామి యం.యల్.ఏగా ఉన్నప్పుడు నియోజకవర్గం వాళ్లు ఏమి అడిగనా సరేననే వాడు. మినిష్టర్లను కలిసేవాడు. కమీషనర్లను దర్శించేవాడు. కలెక్టర్లను పలకరించేవాడు. ప్రజల విన్నపాలు తెలిపేవాడు. మహజర్లు అందించేవాడు. నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడ్డాడు. కొన్ని పనులు జరిగేవి. కొన్ని జరిగేవి కావు. అయినా ప్రయత్నించేవాడు.

మంత్రి అయిందగ్గర్నుంచి ఫ్యూడల్ శక్తులతో పేచీ మొదలయింది.

ఏవేవో చేయమనేవాళ్ళు .పైగా  ఆర్థికమంత్రి, కొన్ని న్యాయంగా, కొన్ని అన్యాయంగా తెలిసిపోతున్నాయి. కొన్ని సాధ్యం, కొన్ని అసాధ్యం, అర్థమయిపోతున్నాయి.

యం.యల్.ఏగా ఉంటే వాళ్ళనూ వీళ్ళనూ తమ వాళ్ళ కోసం అర్థించటం జరిగేది.

మంత్రిగా తానే నిర్ణయం తీసుకోవలసి రావటం తలనొప్పిగా మారింది. తలనొప్పిని కేబినెట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసేవాడు. కమీషనర్లనీ, కలెక్టర్లనీ అర్థించటం పోయి, సాధ్యాసాధ్యాలు తెలిసివచ్చి నోటమాట లేనివాడయ్యాడు.

కోరిన పని చేయకపోతే ప్రజలకు కష్టం. చేస్తే ప్రభుత్వానికి నష్టం. మంత్రి మాట పడిపోయింది.

రెంటికీ చెడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం పట్ల బాధ్యతగా ప్రవర్తించాడు. నియోజకవర్గం ప్రజలకు కష్టమయింది.

"నీ వల్ల మాకేం లాభం?"

"నువ్వెందుకింక?"

వాటికి మంత్రి జవాబు చెప్పాడు. "న్యాయం చేస్తాను."

"న్యాయం చేయటానికి దేశంలో చాలా మంది ఉన్నారు. నువ్వే అక్కరలేదు."

" ఈ సారి ఎన్నికలు రావా? వస్తాయి. నువ్వు పోటీ చేయవా?- చేస్తావు. గెలుస్తావా?- చూసుకో మా తడాఖా" పగబట్టారు.

పగబట్టినవాళ్ళు కాళ్ళకు బలపాలు కట్టుకొన్నారు. నిద్రపోలేదు. రణరంగంలోకి దిగారు. పార్టీ జిల్లాశాఖను బెదిరించారు. రాష్ట్రశాఖను కలిశారు. కాగితాలు ఫంపారు. ప్రయోజనం లేదు.

అధిష్ఠాన వర్గాన్ని దర్శించారు. అర్థించారు. లాభం లేదు.

ప్రజల్ని కలిశారు. బోధించారు. శూన్యం!

దళితులా మాట వినటం లేదు. బహుజనులా బదులు చెప్పటం లేదు. సాయిబులా కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. తిప్పేసామిని గెలిపించి తీరతామంటున్నారు.

నియోజకవర్గంలోని ఓటర్లలో ముప్పాతిక మంది వీళ్ళే. తమ కులం వాళ్ళు నూటికి పదిమంది కూడా లేరు.

తమ కులం ఏం చేస్తే దాన్ని తిరస్కరించే మరో కులం ఉండనే ఉంది. వాళ్ళ సంఖ్యా తమ సంఖ్యా సమానంగా ఉంటాయి.

వీళ్ళు సపోర్టు చేస్తే వాళ్ళు అపోజు చేస్తారు.

వీళ్ళు అపోజు చేస్తే వాళ్ళు సపోర్టు చేస్తారు.

అభ్యర్థితో వాళ్లకు పనిలేదు.

తాము వ్యతిరేకమా, వాళ్ళ అనుకూలం. తాము అనుకూలమా, వాళ్ళు వ్యతిరేకం. దీనికిక తిరుగులేదు.

వాళ్ళను సంప్రదించి ప్రయోజనం లేదు,

మొత్తం మీద తిప్పేసామి గెలుపు ఖాయంగా ఉంది.

'ఓడించటం ఎలా?'

వాళ్ళకిది సమాధానం లేని ప్రశ్న

కానీ మార్గం వెతుక్కొన్నారు.

ఆ ఫ్యూడల్ శక్తులు తమ జీతగాణ్ణి డమ్మీగా నిలబెట్టటానికి నిర్ణయించేరు

అతడి నామినేషన్ కూడా వేయటానికి మూడూ - ఐదూ మధ్యే ఏర్పాటు చేశారు.

తిప్పేసామిది కూడా అదే సమయం.

ఆ సమయంలో ఆర్.డి.వో ఆఫీసులో ఇసుకవేస్తే రాలనంత జనం ఉంటారు.

తిప్పేసామి నామినేషన్ వేయకుండా ఆపితే, డమ్మీ అభ్యర్థి అధికార పక్షానికి అసలు అభ్యర్థి అవుతాడు. చాలు. గెలిచినా ఓడిగా ఒక్కటే. తిప్పేసామి గెలిచే ప్రసక్తిలేదు.

ఫ్యూడల్ శక్తుల కేంప్‌కి తిప్పేసామి సమాచారం అందుతున్నట్లే, వాళ్ళ సంగతులు వీళ్ళకూ చేరుతున్నాయి.

తిప్పేసామిని నామినేషన్ వేయకుండా చూడటానికి వాళ్ళు సిద్ధం చేసుకొన్న ప్రణాళిక స్పష్టంగా వీళ్ళకు తెలిసిపోయింది.

"ఏం చేయాలి"

"తిప్పేసామి చేతుల్లోంచి పత్రాలు లాక్కొని చించిపారెయ్యాలి!"

"పోలీసులు?"

"వాళ్ళు మనవాళ్ళు!"

"చూస్తూ ఊరుకొంటారా?"

"ఏమీ చేయరు."

"మరి వాళ్ళ అనుచరులు?"

"వాళ్ళతోనే సమస్య!"

" ఏం చేయాలి?"

"వాళ్ళను బెదిరించాలి. వెళ్ళగొట్టాలి."

"వాళ్ళూ తిరగబడి తరిమితే?"

"బాష్పవాయువు."

"మన దగ్గరుందా?"

"కావలసినంత!"

"అదేపని వాళ్ళూ చేస్తే!"

"చేయలేరు."

"సపోజ్ - చేస్తే!"

"వేట కొడవళ్ళు తీయటమే!"

"వాళ్ళూ తీస్తే"

"తీయలేరు - తెగించిన వాళ్ళు - వాళ్ళూ వేట.కొడవళ్ళతో నరికితే?"

"బాంబులే!"

"వాళ్ళూ వేస్తే?"

"వేయలేరు"

"వేస్తారు. సిద్ధంగా ఉన్నారు. కమాండరు సామాన్యుడు కాడు. అన్నింటికీ సిద్ధంగా ఉన్నాడు. వేస్తే?"

"తుపాకులే! రైఫిళ్ళే!పిస్తోళ్ళే!"

"వాళ్ళు ఎ.కె 47లు తీస్తే"

"తిప్పేసామిని చంపటమే!"

"చంపకపోతే!"

"చంపి తీరాలి"

"వాళ్ళు చంపితే?"

"ఎవర్ని?"

"డమ్మీని!"

'అసాధ్యం. వాడు మాతో ఉంటాడు. మా మధ్య ఉంటాడు. ఇది కోట. ఎవరూ రాలేరు. వస్తే పోలేరు. సస్తే చంపలేరు."

సమాచారం విని చప్పబడిపోయాడు తిప్పేసామి.

"నేను రడీ!" అన్నాడు కమాండరు... ఉరఫ్ అర్జునుడు.. ఉరఫ్ పంచమ పాండవ మధ్యముడు.

తిప్పేసామి ముఖం మాడిపోయింది. ఏడిచినట్లుంది. ఏడున్తున్నట్లుంది. ఏడుద్దామన్నట్లుంది.

" ఏం చేసినా హింస తప్పేటట్లు లేదు" సామి గొణిగాడు.

"అయినా సరే!" అన్నారు అనుచరులు.

"ఎందుకొచ్చిన చావులు?" అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు.

"నేను నామినేషన్ వేయను?" నిశ్చయంగా చెప్పాడు.

అనుచరులు అదిరిపోయారు.బాంబుపడ్డట్లు భయపడ్డారు.

"నువ్వు నిమిత్తమాత్రుడిని" అన్నాడు కమాండరు.

కృష్ణార్జునుల పాత్రలు తారుమారయ్యాయి. "వేసేవాడివి నువ్వు కాదు. వేయించే వాణ్ణి నేను కాదు. మనం కర్తలంకాము. కర్మలం. నిష్కామ కర్మ. నువ్వు నామినేషన్ వేయక తప్పదు."

"వేయను!"

కృష్ణుడు అస్త్ర సన్యాసం చేస్తున్నాడు.

"ఎందుకు వేయవు?"

అర్జునుడు గీతోపదేశం చేస్తున్నాడు.

"ఎందుకీ హింస?"

"తప్పింపగలవా?"

"తప్పుకొందాం?"

"ఎక్కడికి పోతావ్? ఎలా పోతావ్? నిన్ను చంపుతాం? మేం సస్తామ్. నువ్వు పోలేవు! నామినేషన్ వేసి తీరాల్సిందే!" కమాండరు గావుకేక పెట్టాడు. అనుచరులు సై సై అన్నారు.

తిప్పేసామికి తప్పేటట్లు లేదు. మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు. నామినేషన్ వేయకపోతే నిజంగానే చంపుతారేమోనన్నంత భయం కలిగింది.

"ఇప్పుడే నామినేషన్ వేస్తే?" తిప్పేసామి అడిగాడు.

"ఎందుకు?" కమాండరు నిలదీశాడు.

"ఇబ్బందులుండవు!"

"ఇంత అపోజిషన్‌లో సుముహూర్తంలో వేస్తేనే కష్టం గెలవటం! ఇక దుర్ముహూర్తంలో నామినేషన్ వేసి గెలుద్దామనుకొంటున్నావా?" కమాండరు మండిపడ్డాడు.

తిప్పేసామి తల పట్టుకొన్నాడు.

"సమయానికి వెళతాం. నామినేషన్ వేస్తాం. ఆరోగ్యంగా తిరిగి వస్తాం. నువ్వు భయపడకు"

★ ★ ★

"భయం లేదు." "సరిగా నామినేషన్ వేస్తాం. యం.యల్.ఏ అవుతాం. అయినా ఏం లాభం?"

"ముఖ్యమంత్రివి అవుతావు?"

" ఏ లాభమూ వద్దు!"

"పైసా సహాయం చేయలేను. చేయనివ్వరు. చేయటానికి వీలుండదు."

"సక్రమంగా మాకు రావలసినవి రాకుండా ఆపకపోతే చాలు."

" ఆ పని చేయగలను!"

"మాకామాత్రం చాలు"

" ఈ మాత్రం జరగటానికి నేను ముఖ్యమంత్రిని కానక్కరలేదు."

"అయి తీరాలి."

" అనవసరమయిన హింస. ప్రాణనష్టం. నామినేషన్లే ఇలా ఉంటే, ప్రచారం ఎలా ఉంటుంది. ఎన్నికలు ఎలా ఉంటాయి? ఫలితాలు ఎలా ఉంటాయి."

వాటిని గూర్చి నువ్వు ఆలోచించనక్కరలేదు. వాటిని మాకు వదిలెయ్. నామినేషన్ వేయటమే నీ పని. ఫలితంతో నీకు నిమిత్తం లేదు.

"ప్రాణహాని కదా!"

"నీకు ప్రాణభయం ఉందా?"

"లేదు"

"మరి?"

"మీ గురించే"

"మర్చిపో!"

"మరి?"

"మా సంగతి మాకు బాగా తెలుసు. నువ్వుగెలవాలి. ముఖ్యమంత్రివి కావాలి. ఆ కుర్చీలో కూర్చోవాలి. రాష్ట్రాన్ని పరిపాలించాలి."

"ఏం లాభం?"

" మాకు లాభం వద్దు. నష్టం జరక్కపోతే చాలు."

"అది ముళ్ళకిరీటం."

"పెట్టుకోక తప్పదు!"

"సుఖ శాంతులుండవు!"

"లేకపోయినా ఫరవాలేదు.

చూడు! నీకు నువ్వు సొంతం కాదు. నువ్వు మా సొంతం. ఇప్పుడు ముఖ్యమంత్రి కాదగ్గవాడు మనలో ఎవడూ లేడు. నువ్వొక్కడివే సమర్థుడివి. ఇందుకోసం ముప్పైఏళ్ళు పోరాడావు. మేమూ నీతోపాటు పోరాటంలో ఉన్నాము. పరోక్షంగా దళితులంతా నీతోపాటు ఈ పోరాటంలో ఉన్నారు."

" మనవాళ్ళలో మరొకణ్ణి ముఖ్యమంత్రి అయ్యేట్టు ప్రయత్నిద్దాం!"

"అటువంటి వాడు లేడు. చదువుండాలి. సంస్కారముండాలి. అనుభవముండాలి. అర్హత ఉండాలి. ముప్పైఏళ్ళుగా పోరాడిన రాజకీయ పరిజ్ఞానం ఉండాలి. ఇవన్నీ ఉన్నవాడెవడు నువ్వు తప్ప, నీకు తప్పదు."

"కాదనను. కానీ-"

"మరేం చెప్పవద్దు. నువ్వు ముఖ్యమంత్రివి కావాలి. అందుకు యం.యల్.ఏ.వి కావాలి. కాబట్టి నామినేషన్ వేయాలి."

"వేస్తాను!"

"మా వాడు ముఖ్యమంత్రి అయ్యాడన్న గర్వం. అహంకారం. అదృష్టం. ఆనందం చాలు మాకు. మేము తలెత్తుకొని తిరగాలి. మా కలలు నిజం కావాలి. మా నిరీక్షణ ఫలించాలి. అంతే! అంతకంటే మాకేమీ వద్దు."

తిప్పేసామి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. దిక్కులు చూస్తున్నాడు.

"నువ్వు గెలుస్తావు. నువ్వు నామినేషన్ వేసి తీరతావు."

నామినేషన్ వేయటానికి వెళ్ళే ఊరేగింపులో పాల్గొనటానికి పల్లెల నుంచి దళితులు గుంపులు గుంపులుగా వచ్చారు. వాళ్ళలో చాలామంది జీతగాళ్ళు. చింపిరి జుత్తు పెరిగినగడ్డం, చిరిగిన అంగీ.

వాహనాలు రడీగా ఉన్నాయి. బేండ్ మేళం సిద్ధంగా ఉంది. బాణాసంచా కాల్చారు. నామినేషన్ ఊరేగింపు బయలుదేరింది.

లారీలు, కార్లు, జీపులు, ఆటోలు, రిక్షాలు, ప్రజలు పెద్ద ఊరేగింపు వాహనాల నిండా

క్రిక్కిరిసిన జనం, మిగిలిన వాళ్ళు కాలినడక.

అప్పటికే డమ్మీ నామినేషన్ వేశాడు. ఇసుకేస్తే రాలనంత జనం. వాళ్ళు తోవ ఇవ్వరు. తిప్పేసామిని పోనీరు. తిరిగి రానీరు.

వాతావరణం వేడిగా ఉంది.

ఊరేగింపు సాగుతూ ఉంది, బాణాసంచా కాలుస్తున్నారు. బేండ్ మేళం మోగుతూ ఉంది. జనం పాడుతున్నారు. ఆడుతున్నారు.

ఇంకా అరగంట టైం ఉంది..

ఫ్యూడల్ శక్తులు ఆనందిస్తున్నాయి.

చూస్తుండగానే ఊరేగింపు వచ్చింది. ఆగింది. నిశ్శబ్దం!

వాహనాల నిండా మనుషులున్నారు ఒక్కరూ దిగటం లేదు.

అపోజిషన్ వాళ్ళు సిద్ధంగా ఉన్నారు.

దిగితే బాష్పవాయువు.

ధిక్కరిస్తే బాంబులు.

తిరగబడితే కాల్పులు.

తిప్పేసామి కారు, ఏసికారు, అందరి దృష్టినీ ఆకర్షిస్తూ ఉంది.

కారులోంచి తిప్పేసామి దిగలేదు. దిగేట్టులేడు.

అందరికీ ఆశ్చర్యం. అంతా విరగబడి చూస్తున్నారు.ఏమవుతుందోనని ఆసక్తి. కాంపౌండులో వాళ్ళు చూశారు. తొంగి చూశారు. ముందుకు వంగి చూశారు. ముందుకు వచ్చి చూశారు.

వాహనాలలో నుంచి ఎవరూ దిగటం లేదు.

ఊరేగింపు సాగటం లేదు.

ఆగిపోయింది. డాన్సులు లేవు. పాటలు లేవు. మాటలు లేవు. బేండూ లేదు. తప్పెట్లు లేవు. అంతా నిశ్శబ్దం.

రోడ్డు మీద ఖాళీ లేదు. షాపుల్లో జనం. ఇళ్ళ మీద జనం. కాంపౌండులో జనం రోడ్డుమీదికి వచ్చి వింత చూస్తున్నారు.

ఊరేగింపులో వెనుక ఉన్న జనం ఖాళీగా ఉన్న కాంపౌండులోకి వచ్చి, ఆర్.డి.వో ఆఫీసు పైకెక్కి వాహనాల వైపు చూస్తున్నారు.

తిప్పేసామి దిగడేం? లోపలికి రాడేం? నామినేషన్ వేయడేం?

అందరికీ సందేహం. అంతటా నిశ్శబ్దం.

ఏమవుతుందో ఏమో!

పోలీసులకు పనిలేదు. డమ్మీ జనానికి పనిలేదు. కమాండరు పత్తా లేడు.

వాతావరణం ఉద్రేకంగా ఉంది.

వాహనాలు ఘనీభవించాయి. రోడ్డు స్తంభించింది. మనుషులు ఊపిరి పీల్చటం మర్చిపోయారు.

గడియారం స్తంభం అయిదు కొట్టింది. డమ్మీల ఆనందానికి పట్టపగ్గాల్లేవు.

ఉన్నట్లుండి వాహనాలు ముందుకు కదిలాయి. మళ్ళీ కదలిక. మళ్ళీ శబ్దం. మళ్ళీ పాటలు, డాన్సులు, బాణాసంచా, తప్పెట్లు.

ఫ్యూడల్ శక్తులు పరమానందం పొందుతున్నాయి.

జనం ఏసి కారు నీలి అద్దాలలోకి చూస్తున్నారు లోపల తిప్పేసామి జాడలేదు.

ఊరేగింపు బయలుదేరటం చూచి ఆర్.డి.వో ఆఫీసు పైకి ఎక్కిన జీతగాళ్ళు కాంపౌండులోని జీతగాళ్ళు అంతా పొలోమని వచ్చి జనంలో కలసిపోయారు.

ఊరేగింపు మలుపు తిరిగి, గడియారం స్తంభం దాటి, వెనుదిరిగి పోతూ ఉంది.

ఫ్యూడల్ శక్తులు బాణా సంచా కాలుస్తున్నాయి. ఆనందంతో పరవశం చెందుతున్నాయి.

తిరిగివచ్చిన ఊరేగింపు తిప్పేసామి కారు ఎలెక్షన్ ఆఫీసు ముందు ఆగింది.

వెనుక డాన్సు చేస్తున్న జీతగాళ్ళు ముందుకు వచ్చారు.

లారీ ఎక్కిన జీతగాడు ప్రజలందరికీ నమస్కారం చేశాడు.

"నామినేషన్ వేయించిన మీకందరికీ ధన్యవాదాలు."

★